- డా. పి.శివరామకృష్ణ

పోరాడేది గిరిజనులు పట్టాలుపొందేది ఇతరులు

'చిమలుపెట్టిన భుట్టలు పామలకిరవైనయట్లు' గిరిజన ప్రాంతమంతా కబ్జాదారులతో, కలపదొంగలతో, వెలి కాపలాదారులతో నిండిపోయింది. కలసవచ్చినవారు ఆస్థిపరులౌతుంటే - గిరిజనులు అమరవీరులౌతున్నారు.

పశ్చిమగోదావరిజిల్లా కోటరామచంద్రపురం గిరిజనసంక్షేమ డిప్యూటి కలెక్టర్ 4-5-95న, జీలుగుమిల్లి మండలం జిల్లేళ్ళగూడెం గ్రామంలో 29 ఎకరాలలోగల గిరిజనేతరులను తొలగించవలసిందిగా ఆదేశాలిచ్చారు. మూడేండ్లుగా అక్కడ గిరిజనప్రాంతంలోపనిచేస్తున్న మాసహచరుడు, శ్రీబలుసు పురుషోత్తమరావు, ఈ ఉత్తర్వును నాటి కొవ్వూరు సబ్‌కలెక్టర్ (నేటి హైదరాబాద్ కలెక్టర్) శ్రీ అరవింద్‌కుమార్ దృష్టికితెచ్చారు. 5-5-95న అంటే తీర్పువచ్చిన మరునాడే ఆభూములు గిరిజనులకు అప్పగించడానికి ఏర్పాటు చేయవలసిందిగా మండలరివెన్యూసిబ్బందిని ఆదేశించి, వారంరోజులలో స్వయంగావెళ్ళి అప్పగించారు. అరవిందకుమార్, అంతకుముందు రంపచోడవరం సబ్‌కలెక్టర్‌గా పనిచేశారు. అక్కడి సంప్రదాయాలు, మా అవగాహనలలోగల న్యాయబద్ధత వారికి బాగాతెలుసు. కాని ఇంతత్వరగా భూములు అప్పగించిన సందర్భం ఈ దశాబ్దంలో ఇది ఒక్కటే కావచ్చు.

భూపోరాటానికి నాంది -

ఇంతత్వరగా గిరిజనులకు భూమలు అప్పగించడంమీద గిరిజనేతరులు పెద్ద రగడచేశారు. ట్రాక్టర్లతో ఆ గ్రామాన్ని చుట్టుముట్టి గిరిజనులు పొలంలోకిదిగకుండా అడ్డుకున్నారు. గిరిజనులు విల్లంబులతో ఈ మూకను తరిమికొట్టడమేకాదు 1932లో జరిగిన సెటిల్‌మెంట్ ప్రకారం - గ్రామంలో భూములన్నీ తమ పూర్వీకులు గుజ్జుకుటుంబంవారివేనని నాటి అచ్చుచికార్డ్‌తెచ్చిచూపారు. భూములన్నీ క్రమంగా గిరిజనేతరులపరం ఎలా అయినాయి అని ప్రశ్నించారు. తమహక్కులు నిరూపించుకోకుండా గిరిజనేతరులు ఏ పొలంలోకి ప్రవేశించకుండా అడ్డగించారు.

కుడిఎడమల దగాదగా -

1902 రికార్డులో జిల్లేళ్ళగూడెం భూములన్నీ గుజ్జువారివే. కాని 1932 రికార్డులో 60ఎకరాలు జీలుగుమిల్లి కరణం పేర ఉన్నాయి. ఈ కరణం కోయవారి భూములు వెయ్యెకరాలు ఆక్రమించాడని, తూర్పుగోదావరి ఏజెన్సీ సరిహద్దుల్లో చాలా బినామీఅమ్మకాలు జరిగాయని వీటిని విచారించవలసిందిగా 1926లో నాటి కలెక్టర్ ఆదేశించారు. గిరిజనుల భూములు కొనడానికి తన దగ్గర పర్మిషన్ తీసుకున్నవారి సంఖ్య నామమాత్రమైతే భూములు కొనుక్కునవారిసంఖ్యను రిజిస్ట్రార్ ఆఫీస్ చాలా ఎక్కువగా చూపిస్తుందని ఒక కలెక్టర్ 1929లో మద్రాస్ ప్రభుత్వానికి ఫిర్యాదుచేశాడు. గిరిజన పెద్దలు చాలాన్యాయంగా వ్యవహరిస్తారని - కాబట్టి వారి భూములకు పట్టాలిచ్చి - ఆ పట్టాలుకొనకుండా చట్టాలుచేసి - కొన్నవారిమీద కేసులుపెట్టి - ప్రభుత్వం కష్టాలు కొనితెచ్చుకోనక్కరలేదని 1928లో పోలవరం తాలూకాలో పనిచేసిన సెటిల్మెంట్ ఆఫీసర్ ప్రభుత్వానికి పంపిన నివేదిక ఆనాటి పరిస్థితులకు అద్దంపడుతుంది. ఇలా ఉన్నతాధికారులందరూ వాస్తవ పరిస్థితిని ప్రభుత్వానికి తెలియపరుస్తూవచ్చారుకాని, నాటి పౌరసమాజంలో సామాజిక స్పృహ సంఘసంస్కరణకే పరిమితంకావడంతో భూమి, అడవి హక్కుల నిర్ధారణలో స్థానికులుచేస్తున్న అక్రమాలను అరికట్టిన సందర్భాలు కనిపించవు. బ్రిటిష్‌వారు స్వయంగా పరిపాలిస్తున్న గ్రామాల్లోనే ఇంత మోసం జరుగుతుంటే సంస్థానాలు, జమీందారీలకింద జరిగే మోసాలసంగతి చెప్పనక్కరలేదు. నాటి యువతరం గౌతు లచ్చన్న, ఎన్.జి.రంగా మొదలైనవారు ఈ జమీందారుల ఆగడాలను అరికట్టడంలో నిమగ్నమయ్యారు. ఈ విషయంలో కాంగ్రెస్ కేంద్రనాయకత్వంతో తగాదాపడ్డారు. శ్రీకాకుళంనుండి చెన్నపట్టణంవరకు పాదయాత్రచేశారు. 'మినుములూరు బాట రావాలె - ముఠాదారీ కట్టుపోవాలె' అంటూ పాడేరుమన్యంలోకూడా ఈ ఉద్యమం ప్రతిధ్వనించింది. కాని గిరిజన ప్రాంతంలోకి వలసలు మరింత అధికంకాసాగాయి. ఈ వలసలను అధ్యయనంచేసిన ఆచార్య ఎం.ఎస్.ఎ.రావు

(సోషల్ యాక్షన్, జూలై-సెప్టెంబర్, 1983) 1947నుండి కోస్తానుండి వలసవెళ్లినవారు వ్యవసాయ, వ్యాపార దక్షత కలిగిన కులంవారుగా పేర్కొంటూ - వారు ఆయిల్ ఇంజన్లు, గొట్టపు బావులు, ట్రాక్టర్లు అధిక దిగుబడి విత్తనాలు, రసాయనిక ఎరువులు, పురుగుమందులు వ్యాపారపంటలు ప్రవేశపెట్టారని- పెట్టుబడికోసం వ్యవసాయ పరపతి సంఘాలు ఏర్పరచుకున్నారని - మొదట్లో వీరు కౌలుదారులుగా వచ్చినప్పటికీ, ఈ విధంగా పెట్టుబడులు పెంచి వ్యవసాయం గిరిజనుడికి అందుబాటులో లేకుండా చేసారంటూ - గిరిజన ప్రాంతాలు పరాధీనమైన క్రమాన్ని వర్ణించారు. వారు భూమిహక్కుల లిటిగేషన్ తమ చేతులలోకి తీసుకున్నారు.

రైత్వారీపద్ధతులు -

పశ్చిమగోదావరిజిల్లా గిరిజనప్రాంతంలో 64 గ్రామాలు బ్రిటీష్‌ప్రభుత్వ రైత్వారీవిధానంకిందఉండగా మరో 29 గ్రామాలు జమీందారీవిధానంకిందఉన్నాయి. ఈ జమీందారీలు రద్దుచేసి 1970లో రైత్వారీ విధానం ప్రవేశపెట్టారు. ఈ విధానంకిందఇచ్చిన పట్టాలుపోను ఇంకా 5500 ఎకరాల ప్రభుత్వభూములుకూడా గిరిజనేతరులే అనుభవిస్తున్నారు. వారిని తొలగించి ఆభూములు తమకుపంచాలని గిరిజనులు పట్టుపట్టి ఆక్రమించసాగారు.

రికార్డుప్రకారం హక్కులతనిఖీ -

రెడ్డిగణపవరంలో బండారువారిపాలం గిరిజనులకు పంచుతూపట్టాలిచ్చారు. కాని భూములు అప్పచెప్పవద్దని చివరిక్షణంలో కలెక్టర్ టెలిగ్రాం ఇచ్చాడని, కరాటం చంద్రయ్య సీలింగ్‌పొలానికి తనకు పట్టాఇచ్చారు కాని, పదేళ్ళనుంచి తిరుగుతున్నా కబ్జాఇవ్వలేదని బూసరాజుపల్లి పైదా వెంకన్న, అవేర్‌వారి హస్పిటల్‌కోసం తన నాలుగెకరాలు తీసుకున్నారని కృష్ణాపురం కాకి వీరమ్మ - ఇలా ఎందరో అభాగ్యులు ప్రతివూళ్ళో మమ్మల్ని చుట్టుముట్టేవారు. హక్కులున్నవారందరినీ పొలాలుదున్నుకోవడాన్ని ప్రోత్సహించాం. గిరిజనుల దూకుడుకు కళవళపడిన కొందరు గిరిజనేతరపెద్దలు శ్రీ కె.యల్.నరసింహారావు, వాడపల్లి రామారావు, హుకుంపేట జమీందారు హోతా రామచంద్రమూర్తి, ఉప్పలపాటి వాసు వీరంతా ఈ ఉద్రేకాలు తగ్గించవలసిందిగా కోరారు. రికార్డుప్రకారం హక్కులతనిఖీ జరగాలన్న ప్రతిపాదనకు వారు అంగీకరించారు. అందరంవెళ్ళి జిల్లాకలెక్టర్ శ్రీ డి. రామకృష్ణగారిని 13-5-95న కలిశాం. ఆయన ఈ 15-5-95న పోలవరం మండలం మనగోపలగ్రామానికివచ్చి భూమిరికార్డు చదివించారు. గ్రామంలోగల 300 ఎకరాలలో 50 ఎకరాలలోతప్ప మిగతా భూములు సాగుచేస్తున్న గిరిజనేతరులకు పట్టాలులేవని తేలిపోయింది. ప్రక్కగ్రామం పేడ్రాలలో హుకుంపేట జమీందారుకు అందరూ అధికారులు పట్టాతిరస్కరించారు. కాని కమీషనర్ ఒక్కముక్కలో 250ఎకరాలకు పట్టాయిచ్చాడు. అదేసాయంత్రం తాటిరామన్నగూడెంలో హక్కులుండీ భూమిలేనివారిని కలెక్టరు ముందుకు తోశాం. జిల్లా అధికారయంత్రాంగం ఆ భూములపంపకంపట్ల దాటివేత-సాచివేతధోరణి అవలంబించసాగింది. అటు సబ్‌కలెక్టర్, ఇటు గిరిజనసంక్షేమ డిప్యూటీకలెక్టర్ ఉండగా, సహకారశాఖనుండి, గిరిజనాభివృద్ధిసంస్థకువచ్చిన అధికారికి, గిరిజనులను సమాధానపరచేపని అప్పగించారు. ఆయన చేసిందేమీలేకపోయినా, అందరి ఆగ్రహానికిబలై, వెంటనే బదిలీ అయిపోయాడు.

సంఘాల రంగప్రవేశం -

భూములఅప్పగింతలో జరుగుతున్న నిర్లక్ష్యానికి గిరిజనులు రెచ్చిపోయారు. గిరిజనేతరులు మనుగోపలగ్రామంమీద దాడిచేసి కారం వెంకటేశ్వర్లు అనే గిరిజనుడిని చితకబాదారు. వారందరినీ, శారద కలెక్టర్ దగ్గరకు తీసుకెళ్ళింది. కాని అధికారులు గిరిజనేతరులమీద ఏచర్యతీసుకోలేదు. ఎదురుదాడికి రెచ్చగొడుతూ రైతుకూలీ సంఘాలు రంగప్రవేశంచేశాయి.

పరిస్థితులు ఉద్రిక్తంగా మారసాగాయి. 1932 రికార్డుల ఆధారంగా హక్కుల తనిఖీ, ప్రభుత్వ భూములపంపకం గిరిజనులు ఉద్యమిస్తున్నారని జూన్ 1996లో కలెక్టర్ ప్రభుత్వానికి తెలియపరచారు. ఆగస్టు 5న బూసరాజుపల్లిలో గిరిజన - గిరిజనేతరులమధ్య పెద్దఘర్షణ జరిగింది. ఆరోజు నేను, నాటి గిరిజన సంక్షేమశాఖ కమీషనర్ శ్రీ కె. రాజు (నేటిపంచాయతీరాజ్‌శాఖ కార్యదర్శి) ఇటీవలే రిటైరైన గిరిజన పరిశోధనసంస్థ డైరెక్టర్ డా. శాస్త్రి మొదలైనవారందరం రోజంతా హైదరాబాదులో ఒక సమావేశంలోఉన్నాం. ఈ ఘర్షణలోనేను, 167వ, అంటే చివరి నిందితుడిని. మరునాడే 6-8-96న, నాటిముఖ్యమంత్రి ఈ ఘర్షణలమీద తొలిసమావేశం

నిర్వహించారు. ప్రభుత్వ భూములలో ఉన్నవారికి సెటిల్మెంట్ పట్టాలివ్వాలని - తగినంత పోలీసుబలగాలను పంపాలని నిశ్చయించారు.

బూసరాజుపల్లి ఘర్షణ తరువాత గిరిజనులకు ధైర్యం చెప్పడానికి మాతోపనిచేస్తున్న రిటైర్డ్ యం.ఆర్.వో పబ్బిశెట్టి బాలకృష్ణ మనగోపలవెళ్ళారు. రాత్రివేళ. గ్రామమంతా చిత్తుగా తాగివున్నారు. ఎవ్వరు విసిరారో ఒకరాయి బాలకృష్ణ కంటికితగిలింది. ఆయన కన్నుపోయింది. ఈ సంఘటన మమ్మల్ని చాలా కలచివేసింది. తరువాతైనా ఆగ్రామంవారు విచారం తెలియపరచలేదు. తప్పుచేసిన మనస్తత్వంవల్లకావచ్చు మమ్మల్ని తప్పించుకొని రైతుకూలీ సంఘాలతో తిరగసాగారు.

ఊరేగింపులతో సరిపెట్టుకున్నారు -

అయినప్పటికీ ప్రభుత్వం కొత్తగా నియమించిన సెటిల్మెంట్ ఆఫీసర్ ముందు గిరిజనుల తరపున మేం పిటీషన్ దాఖలుచేశాం. సెటిల్మెంట్శాఖ అత్యున్నతాధికారి శ్రీ ఆనందరావు, (తరువాత ప్రభుత్వ ప్రధానకార్యదర్శి) మా పిటీషన్మీద 1990లో చింతలపూడి పట్టాలపునర్విచారణ చేపట్టారు. కాని అదేశాఖలో స్థానికఅధికారి ఈ కొవ్వూరు సెటిల్మెంట్ ఆఫీసర్ మాలోకస్స్టాండి తిరస్కరించారు. హైకోర్టు విస్తృతధర్మాసనం మాలోకస్స్టాండి అనుమతిస్తూ - కావలసిన సమాచారంకూడా ఇవ్వవలసిందిగా ఆదేశించింది. ఈ తతంగానికి సంవత్సరంపట్టింది. ఈలోపల సెటిల్మెంట్ ఆఫీసర్ 1600 ఎకరాలకు గిరిజనేతరులకు పట్టాలిచ్చారు. ఒక్క గిరిజనుడుకూడా పట్టాకోసం దరఖాస్తుచేయలేదు. ఖమ్మం గిరిజనులు 1600 ఎకరాల ప్రభుత్వపు తోటను సంపాదించుకుంటే పశ్చిమగోదావరిలో సంఘాలవెంటతిరిగే గిరిజనులు 1600 ఎకరాలకు గిరిజనేతరులు పట్టాలు తెచ్చుకుంటుంటే చూస్తూ ఊరేగింపులతో సరిపెట్టుకున్నారు. హైకోర్టులోగెలిచాక సెటిల్మెంట్ ఆఫీసరు దగ్గర సమాచారం కోసం, విచారణలో పాల్గొనే హక్కుకోసం పట్టుబట్టసాగాము. మాదాడికి తట్టుకోలేక ఆపోస్టు రద్దుచేశారు. అంతవరకు పట్టాలు ఇవ్వడం ఏకపక్షంగా జరిగిందని మేంచేసిన అభియోగానికి సంజాయిషీ ఇవ్వవలసిందిగా కోరిన సర్వేసెటిల్మెంట్ కమీషనర్ శ్రీ వినోద్అగర్వాల్కు జిల్లాఅధికారులు సమాధానం ఇవ్వలేదు. కోర్టుకెళ్ళడానికి తగినసమయంకోసం వేచిచూస్తున్నాం.

పట్టాల పునర్విచారణ -

1969లో శ్రీకాకుళం ఉద్యమాన్ని అణచివేసిన రాష్ట్రప్రభుత్వం ఏజెన్సీ ప్రాంతాలలో గల ముఠాదారి, మహల్దారీ, జమీందారీ పాలన రద్దుచేసి రైత్వారీవిధానం ప్రవేశపెట్టింది. కాని గిరిజనేతరులే సారవంతమైన సాగుభూములకు సెటిల్మెంట్పట్టాలు తెచ్చుకున్నారు. మెట్టభూములలో మాత్రమే గిరిజనులకు పట్టాలిచ్చారు. కలప వర్తకులు అటవీ భూములను సాగుచేస్తున్నట్లు బొంకి పట్టాలుతెచ్చుకున్నారు. శ్రీకాకుళం పోరాటం కాలంలోనే తూర్పుగోదావరి జిల్లా పాపికొండల మొదట్లోగల 'కొండమొదలు'వద్ద కతనపల్లి గ్రామంలో తరిమెల నాగిరెడ్డివర్గం ఆధ్వర్యంలో జమీందారీ భూములఆక్రమణ మొదలైంది. పోలీసుకాల్పుల్లో గిరిజనులు మరణించారు. ఈసంఘటనను ఉదహరిస్తూ, సెటిల్మెంట్ పట్టాలను పునర్విచారణచేయడానికి రాష్ట్రరాజధానిలోగల సెటిల్మెంట్ డైరెక్టర్, గిరిజనులకు అందుబాటులోలేరుకాబట్టి, వారి అధికారాలను తమకు దఖలుపరచాలని 1989లో జిల్లాకలెక్టర్లు గిరిజన సలహా మండలికి చేసిన ప్రతిపాదనను ప్రభుత్వంమన్నించి ముఠాదారీ, మహాల్వారీభూములలో పట్టాలపై పునర్విచారణ అధికారం వారికిచ్చింది. కాని జమీందారీ భూముల విషయంలో మౌనంవహించింది.

కలెక్టర్లకు ఇచ్చిన అధికారాలను గిరిజనేతరులు సవాలుచేశారు. 'శక్తి' కలిగించుకోవడంతో ఆ కేసులన్నీ త్వరగానే కోర్టుకొట్టేసింది. కొన్ని పట్టాలనురద్దుచేసిన తూర్పుగోదావరి కలెక్టరు ఉత్తర్వులతో ఏకీభవిస్తూ నాటి సర్వేసెటిల్మెంట్, ల్యాండ్ రికార్డ్స్ కమీషనర్ (సియస్యస్ఎల్ఆర్) శ్రీ యం. నారాయణరావు (నేటి ఎన్నికల కమీషనర్) ఇచ్చిన తీర్పు చారిత్రాత్మకమైనది. గిరిజనసంక్షేమ అధికారులముందు కాగితాలు చూపించకుండా, సెటిల్మెంట్ఆఫీసర్ముందుమాత్రం దాఖలుచేసిన ఆధారాలు నమ్మదగినవికావు అని కొత్తఉపపత్తిని వారు తీసుకొచ్చారు. ఖమ్మంజిల్లాలోగల వెంకటాపురం, నూగూరు, చర్ల, అలబాకలలోగల 187 మహాల్వారీ గ్రామాలలో, రాజకీయఒత్తిడులవల్ల, ప్రజాచైతన్యంలేనందువల్లకావచ్చు ఈ పునర్విచారణ చేపట్టలేదు. జమీందారీగ్రామాలలో ఇచ్చిన పట్టాలపునర్విచారణ అధికారాలను కలెక్టర్కు ఇచ్చే విషయమై ఏ శాసనసభ్యుడు 'గిరిజన సలహా మండలి'లో పట్టుపట్టలేదు. ఏ సంఘం పిలుపునివ్వలేదు.

తూర్పుగోదావరిలో సంఘాలపోరాటం - అధికారుల మద్దతు -

పశ్చిమగోదావరిలో గిరిజనులు ఉద్యమిస్తున్న సమయంలోనే తూర్పుగోదావరి దేవీపట్నంచుట్టుపట్ల గ్రామాలలోకూడా రికార్డులుచదివిరావలసిన భూములుగుర్తించి గిరిజనులను కదిలించాం. క్రమంగా కొండమొదలుసంఘంవారు ఈగ్రామాలలోకి విస్తరించారు. రంపచోడవరం తాలూకాలో మిగిలినచోట చండ్రపుల్లారెడ్డివర్గానికిచెందిన సంఘానిది ఆధిపత్యం. వారిఆధ్వర్యంలోకూడా కొన్ని ఆక్రమణలు జరిగాయి. ఇద్దరి ఆధిపత్యపోరులో కొన్నిగ్రామాలు నలిగిపోతుంటాయి. అప్పట్లో జిల్లాకు కలెక్టర్‌గావచ్చిన శ్రీఆర్.సుబ్రహ్మణ్యం, ప్రాజెక్టుఆఫీసర్ శ్రీ జయేష్‌రంజన్ (నేటి హుడా మేనేజింగ్ డైరెక్టర్), మొబైల్ మెజిస్ట్రేట్, గిరిజనసంక్షేమ డిప్యూటీకలెక్టర్లకు, 70 రెగ్యులేషన్‌కింద విచారణజరిపే అధికారమిచ్చారు. గిరిజనాభివృద్ధిసంస్థ న్యాయసహాయకేంద్రంసేవలనుఉపయోగించుకొన్నారు. ఆక్రమణలను తొలగించడం సాధ్యంకాదు అని తమ స్థాయిలో చట్టబద్ధత కల్పించారు. క్రిమినల్‌కేసుపెట్టి ఒక్కగిరిజనుడినికూడా అరెస్టుచేయలేదు. భూస్వాములపట్టాల రద్దుకోసం ప్రయత్నాలుచేయలేదు. అందువల్ల పోలవరంప్రాజెక్టుకింద మునిగిపోయే ఈభూములు కొన్నిచోట్ల గిరిజనులఅధీనంలోఉన్నప్పటికీ - పట్టాదార్లు గిరిజనేతరులేకాబట్టి గిరిజనేతరులకే పరిహారంవస్తుంది. పోలవరం ప్రాజెక్టు ముంపుప్రాంతమంతా జమీందారీ భూములే. గిరిజనేతరులకే ఎక్కువగా (పట్టా)భూములున్నాయి.

గిరిజనప్రాంతాలలో జరిగేపోరాటాలకు ఇవి మచ్చుతునకలు. గిరిజనులు పోరాడుతుంటారు. గిరిజనేతరులు పట్టాలుతెచ్చుకుంటారు. సమయానుకూలంగా సంఘాలతో రాజీపడి ఆస్తులుపెంచుకుంటారు. కొన్ని స్వచ్ఛందసంస్థల, గిరిజనాభివృద్ధిసంస్థల న్యాయసహాయకేంద్రాల ప్రతాపం స్థానికం. సంఘాలహక్కులేగాని, ప్రజల ఆర్థికహక్కులపట్ల, హక్కులసంఘాలకు ఆసక్తిలేదు. కోర్టులోగెలిచినా వాటిఅమలు ఈ సంఘాలపట్టున్న ఊళ్ళలో వారిదయదాక్షిణ్యాలమీద ఆధారపడిఉంది. కేసుల విచారణకు సహకరించవలసిందింగా ఈ నాయకులను ఆశ్రయించాలి. భూస్వాముల ట్రాక్టర్‌లలోనే, జనాన్నితోలి- దున్నేవాడిదేభూమి అని వీరు ఊరేగింపులుతీస్తుంటారు. వారి ఉద్యమాలు విస్తరిస్తుంటే గిరిజనులపరిస్థితి రోజురోజుకు దిగజారుతుంది.

పోడురాజకీయాలు -

ఇప్పటికి గిరిజనప్రాంతంలో నగభాగం వలనవచ్చినవారి వశమైంది. కొండప్రాంతాల్లో పోడువ్యవసాయంచేసుకుంటున్న గిరిజనులకు స్వాధీనహక్కులు కల్పించడానికి అటవీసంరక్షణచట్టంలో అవకాశాలున్నాయి. కావాలంటే కొన్ని సవరణలు చేసుకోవచ్చు. వాటి అమలుకోసం ఒత్తిడిచేయవలసిందిపోయి, పాలకపక్షం, వామపక్షాలు కొన్ని స్వచ్ఛందసంస్థలు గిరిజనహక్కులంటూ పార్లమెంట్‌లో బిల్లుపెట్టిస్తున్నారు. ఆ పోడుభూములు ముందు గిరిజనులకు దక్కిన తర్వాత క్రమంగా రైతులపరమౌతాయి. 'మేం పోడునరికిన భూములకు తాము పట్టాలుతెచ్చుకుంటారు. తాము స్వయంగా ఎందుకు పోడునరికి రైతులు భూములుచేసుకోరు' అంటూ అదిలాబాద్‌జిల్లాలో పనిచేసే గోండ్వానా సంఘర్షణ సమితివారు ప్రశ్నిస్తున్నారు. 'పోడు మాజన్మహక్కు' అంటూ గిరిజనులచేత విచ్చలవిడిగా అడవులను నరికించడంలో ఎవరిలాభాలు వారికున్నాయి. ఈ నరికినకలపను అటవీశాఖ కొంత, రైతులు కొంత అమ్ముకుంటారు. నరుకుకూలీ ఖర్చులేకుండా పొగాకు బ్యారన్‌లకు పుల్లదొరుకుతుంది. మహాత్మాగాంధీ అనుచరుడు, మానవశాస్త్రవేత్త నిర్మల్‌కుమార్ బోస్ ఒరిస్సాలో గిరిజనులపోడు వ్యవసాయంగూర్చి రాస్తూ 'కొండకింది రైతులే, గిరిజనుల అవసరానికిమించి పోడుపేరిట అడవిని నరకడానికి ప్రోత్సహిస్తారు. తగులబెట్టిస్తారు. వర్షంవెంటవచ్చిన బూడిదతో కిందనున్న వారి పొలాలు సారవంతంచేసుకోవడానికి ఇటువంటి పన్నాగాలు పన్నుతారు' అని నేషనల్ బుక్ ట్రస్ట్ ప్రచురించిన 'ట్రైబల్ లైఫ్ ఇన్ ఇండియా'లో వివరిస్తారు. 'చీమలుపెట్టిన పుట్టలు పాములకిరవైనయట్లు' గిరిజన ప్రాంతమంతా ఇలా కబ్జాదారులతో, కలపదొంగలతో, వారి కాపలాదారులతో నిండిపోయింది. వలసవచ్చినవారు ఆస్థిపరులౌతుంటే - గిరిజనులు అమరవీరులౌతున్నారు.